క్లుప్తంగా

ఆశాజనకంగా మినుము సాగు



చంద్రేడులో మినుము పంట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో మినుము పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. చంద్రేడు, పెదరాయవరం, వడిశలేరు, రంగంపేట, కోటపాడు, సింగంపల్లి, నల్లమిల్లి, జి.దొంతమూరు, మర్రిపూడి, దొడ్డిగుంట, ముకుందవరం, వీరంపాలెం, ఈలకొలను, ఎస్టీ రాజాపురం తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా మినుము సాగు చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో మొక్కలు ఏపుగా ఎదిగి, పూత, పిందెలతో కళకళలాడుతున్నాయి. రైతులు ఎప్పటికప్పుడు మొక్కలకు అవసరమైన తడులు, ఎరువులు అందించి సంరక్షించుకుంటున్నారు.

రేపు పెదపూడి మండల సమావేశం

పెదపూడి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన పెదపూడిలో గురువారం మాట్లాడుతూ ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని వివిధశాఖాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలన్నారు. గత మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వివరిస్తారన్నారు.

చిన్న పిల్లలకు టపాసులు అమ్మితే చర్యలు



అనసూయ, రంగంపేట తహసీల్దార్

రంగంపేట: దీపావళి బాణసంచా దుకాణదారులు చిన్న పిల్లలకు టపాసులు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కోసు అనసూయ అన్నారు. ఆమె గురువారం మాట్లాడుతూ దీపావళి సందర్భంగా రంగంపేటలో 3, వడిశలేరులో 2, జి.దొంతమూరు గ్రామంలో 2 దుకాణాలకు అనుమతులు ఇచ్చామన్నారు. బాణసంచా దుకాణాలను గ్రామానికి దూరంగా ఖాళీ ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసు, విద్యుత్ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో నూతన నిర్మించిన అయ్యప్ప, సంతోషిమాత, గీతా మందిర దేవాలయం వద్ద అయ్యప్ప మాలధారులకు గురువారం అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవంబర్ 29వ తేదీ వరకూ అన్నదానం జరుగుతుందన్నారు. ఉదయం వడి, మధ్యాహ్నం భిక్ష, రాత్రి వడి ఉంటుందన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా దాతల సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజానగరం: నందరాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఈ కారణంగా ఇక్కడ నుంచి విద్యుత్ సరఫరా జరిగే 11 కేవీ ఫీడర్లపై నందరాడ, నరేంద్రపురాల్లో అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ రంగానికి ఇబ్బంది లేకుండా తెల్లవారుజాము 4 గంటల నుంచి విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు.

పశువుల వ్యాధుల నివారణకు కృషి



పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

కోరుకొండ: పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు పశు వైద్యులు కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ ఏపీఎల్‌డీఏ ఈవో కాంతారావు అన్నారు. కోరుకొండ మండలం గాడాలలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల పెంపకంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. పశువుల గర్భకోశ వ్యాధుల పరీక్ష, నిర్ధారణ, చికిత్స నిర్వహించాలన్న లక్ష్యంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిబిరంలో 42 గేదెలు, 22 ఆవులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ పరీక్షల రిపోర్టును త్వరలో రైతులకు తెలియజేస్తామని బూరుగుపూడి పశువైద్యులు సుప్రియ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 54 దూడలకు పాముల మందు ఇచ్చారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీ ఎం.వెంకటేశ్వరరావు, ఏడీ ప్రభావతి, వైద్యులు ఎ.సుప్రియ, కె.సునీల్ గాంధీ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై చంద్రబాబు నిర్లక్ష్యం

- ప్రభుత్వ వైద్య కళాశాలలను కాపాడుకుందాం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కుతుకులూరులో కోటి సంతకాల సేకరణ



కుతుకులూరు గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కుతుకులూరు రచ్చబండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేదల ఆరోగ్యం, పేద విద్యార్థుల ఉన్నత చదువులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందుకే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, ప్రజా మద్దతు కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం కుతుకులూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో సుమారు రూ.2 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. వాటిలో ఒక శాతం నిధులను ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు ఖర్చు చేసి ఉంటే, వాటి నిర్మాణం పూర్తయ్యి, రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభించారని, వాటిలో ఏడు కాలేజీలను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దాదాపు పూర్తి చేశారన్నారు. 2023–24లోనే ఐదు కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న యత్నాలను నిరసిస్తూ, ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేస్తూ వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ఉద్యమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పార్టీ గ్రామ కన్వీనర్ వీర వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి(ఆర్క్), గణపతి మండల మహిళా విభాగం అధ్యక్షులు తేతలి రుక్మిణి, మండ సుజాత, పులగం వీర్రెడ్డి, సత్తి రాజశేఖర్ రెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, గొలుగూరి సురేంద్ర రెడ్డి, సత్తి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు సత్కారం

మండలంలోని కుతుకులూరులో నూతనంగా పార్టీ పదవీ బాధ్యతలు చేపట్టిన నాయకులను గురువారం సత్కరించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు చిర్ల వీర వెంకటరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సత్తి రమేష్‌రెడ్డిలను పార్టీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శాలువా కప్పి సత్కరించి, అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ కుతుకులూరు గ్రామం వైఎస్సార్‌సీపీ అడ్డా అన్నారు. అధికారం బలంతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎన్ని బెదిరింపులు చేసినా, ఎన్ని దాడులు చేసినా ప్రజల గుండెల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతూనే ఉంటుందన్నారు.



కోటి సంతకాల కార్యక్రమంలో సంతకం చేస్తున్న మహిళ

ఉపాధి పనుల గుర్తింపు

సీతానగరం: మండలంలోని కూనవరంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్ టి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను గుర్తించడానికి గ్రామసభ నిర్వహించారు. లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా 32 కాలువ పూడికతీత పనులు, ఒక చెరువు పూడికతీత పనులు, రైతు పంటభూమిలో సేద్యపు నీటి గుంటలు 12, ఇంకుడు గుంటలు 14, కంపోస్ట్ పిట్స్ ఐదు గుర్తించారు. అలాగే జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాలక్ష్మి, సుంకర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనస్థీషియా దినోత్సవం



పోస్టర్ ప్రజెంటేషన్ చేస్తున్న విద్యార్థిని

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో గురువారం ప్రపంచ అనస్థీసియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనస్థీషియా ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం జరిపారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్‌లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎండీ ధనరాజ్, అధ్యాపకులు కె.జయశ్రీ, డాక్టర్ కవిత, డాక్టర్ ఎ.శ్వేతా ప్రశాంతి, షేక్ మీరా పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో కూటమి విఫలం

- వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- కొమరిపాలెంలో సత్తిబాబు కుటుంబానికి పరామర్శ



కొమరిపాలెంలో సత్తిబాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

బిక్కవోలు: రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఇటీవల జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. ఆ ఘటనలో తయారీ కేంద్రం యాజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ (సత్తిబాబు), కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొమరిపాలెం గ్రామంలో సత్తిబాబు కుటుంబ సభ్యులను గురువారం జగ్గిరెడ్డి పరామర్శించారు. ముందుగా సత్తిబాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేలుడు ఘటన దురదృష్టకరమన్నారు. సంఘటన జరిగిన తొమ్మిది రోజులు గడిచినా ప్రభుత్వం బాధితులకు నష్ట పరిహారం ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఆయన వెంట రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, పార్టీ రాయవరం మండల కన్వీనర్ తమలంపూడి గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరపురపు శ్రీనివాసరావు, కర్రి నాగిరెడ్డి, ఆలమూరు మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, మోదుకూరు గ్రామ సర్పంచ్ పెంటపాటి వెంకన్న, కొత్తపేట నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ నల్లిరాజు తదితరులు ఉన్నారు.

రాఘవపురంలో పొక్లెయిన్ సీజ్

- మట్టి అక్రమ తవ్వకాలను పరిశీలించిన అధికారులు
- సాక్షి కథనానికి స్పందన

సాక్షి ఇంపాక్ట్

కోరుకొండ: మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు స్పందించారు. కొండలను పిండి చేస్తున్న అక్రమార్కులపై సాక్షి పత్రికలో ఆగకొండా కొల్లగొట్టి శీర్షికతో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు రాఘవపురం గ్రామంలో తనిఖీ చేశారు. అక్కడ జిరాయితీ (రైతువారీ స్థలం)లో తవ్వకాలు నిర్వహిస్తున్న పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఖనిజ తవ్వకం శాఖ ఏడీ ఫణిభూషణరెడ్డి, ఆ శాఖ సర్వేయర్ శ్రీనివాస్, రాఘవపురం వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా.. అధికారులు రావడాన్ని గమనించిన అక్రమార్కులు యంత్రాలను దాచేశారు. కోటికేశవరం, మునగాల, నల్లగొండల్లో ఏమీ జరగడం లేనట్టు సృష్టించారు. అయితే కోటి కేశవరం, నల్లగొండ, మునగాలలో కొండలను తవ్విన ప్రదేశాలను సకాలంలో పరిశీలించకపోవడం, అక్కడి నుంచి గ్రావెల్, మట్టి రవాణా చేస్తున్న వాహనాలను నిలువరించకపోవడం, సీజ్ చేయకపోవడంపై స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.



రాఘవపురంలో మట్టి అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్

రూ.31 కోట్లతో అనపర్తి రైల్వేస్టేషన్ ఆధునీకరణ



అనపర్తి రైల్వే స్టేషన్‌లో ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న రైల్వే అధికారులు

అనపర్తి: అనపర్తి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల కోసం రూ.31 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు. వికసిత్ భారత్ అమృత్ వాద్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ డివిజనల్ మేనేజర్ ఫణి కుమార్ గురువారం అనపర్తి స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలు సేకరించి, అవసరాలను సమీక్షించారు. రైల్వే స్టేషన్‌లో కొత్త భవనం, ప్లాట్‌ఫారాల విస్తరణ, ఒకటో ప్లాట్ ఫాం నుంచి మూడో ప్లాట్ ఫారానికి లిఫ్ట్ సౌకర్యం, సీసీ కెమెరాలు, తాగునీటి సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు మాట్లాడుతూ రైల్వే హాల్టులను పెంచాలని, రైళ్ల నిలిపివేత సమయాన్ని పెంచాలని కోరారు. ఫణి కుమార్ మాట్లాడుతూ అనపర్తి రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 100 గ్రామాల ప్రజలు రైల్వే సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. వారి సౌకర్యాల కోసం అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

నేలనంటిన వరి పంట



అధిక వర్షానికి వంగలపూడిలో ఒరిగిపోయిన వరి పంట

సీతానగరం: వంగలపూడిలో ఏటిగట్టు ఆనుకుని ఉన్న గరువు పొలాల్లో సాగు చేసిన వరి పంట అకాల వర్షానికి నేలను అంటింది. కోతకు వచ్చిన సాంబా మైసూరి రకం సోమవారం ఉదయం కురిసిన అధిక వర్షానికి పడిపోయింది. అలాగే పాలదశలో ఉన్న వరి పంట కూడా పడిపోవడంతో రైతులకు నష్టాలు తప్పేలా లేవు. రెండు రోజుల్లో కోతకు రానున్న పంట ఒరిగిపోవడంతో గింజలు మొలకెత్తే అవకాశం ఉంది. పాలదశలోని వరికి గింజ తయారు కాకుండా తప్పలుగా మారి దిగుబడి తగ్గిపోతుంది. ఇలా సుమారు 50 ఎకరాల్లో నష్టం కలిగింది.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: చిన కొండేపూడికి చెందిన మాధవరపు రవికుమార్.. తనపై సోదరులైన మాధవరపు శ్రీనివాస్, చంద్రగిరి, సోదరుడి కుమారుడు సత్యసాయి దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ట్రైనీ ఎస్సై సురేష్ గురువారం తెలిపారు. సోదరుల మధ్య జరిగిన ఘర్షణలో రవికుమార్‌ను చెక్కతో తలపై కొట్టడంతో తీవ్ర గాయమైందన్నారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

రాజానగరం: సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ పేరుతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో రాజానగరంలో గురువారం ఆటో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాలపై 18 శాతంగా ఉన్న జీఎస్టీని 10 శాతానికి తగ్గించారన్నారు. ప్రతి వస్తువుపై కూడా జీఎస్టీ తగ్గిందని తెలిపారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య

రాజానగరం: భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూర్యారావుపేటలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యారావుపేటకు చెందిన నాగరాజు శ్రీజ్యోతి (25) తల్లి దుబాయ్‌లో ఉంటూ కుమార్తెకు ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. అయితే చెడు వ్యసనాలకు అలవాటు పడిన శ్రీజ్యోతి భర్త కృష్ణ ఆ సొమ్ములను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తూ, కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో భార్యాభర్తలిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వీరికి ఏడాదిన్నర, ఎనిమిది నెలల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లల భవిష్యత్తును పట్టించుకోకుండా, తన తల్లి పంపించే సొమ్ములను దుబారా చేస్తున్న భర్త తీరుతో శ్రీజ్యోతి తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

రసాభాసగా శ్రీరంగపట్నం పీఏసీఎస్ సమావేశం



శ్రీరంగపట్నం పీఏసీఎస్ మహాజన సభలో ప్రశ్నిస్తున్న రైతులు

కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నంలో గురువారం జరిగిన పీఏసీఎస్ మహాజనసభ రసాభాసగా ముగిసింది. సొసైటీ చైర్ పర్సన్ అడపా వీరబాబు అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశం రైతుల వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. సొసైటీ నష్టాల్లో కూరుకుపోవడానికి కారణమేమిటని, బకాయి పడిన రైతులను వేధించడం మానుకోవాలని, భారీ మొత్తంలో నగదు బకాయిలున్న వారి నుంచి ముందుగా వసూలు చేయకుండా సన్న, చిన్నకారులను బకాయిలు వసూలు చేయడాన్ని సభ్యులు తప్పుపట్టారు. సమస్యలను పరిష్కరించకపోవడం, సహకారాన్ని అందివ్వలేని త్రీమెన్ కమిటీ, అధికారుల తీరును రైతులు తప్పుపట్టారు. కార్యక్రమంలో త్రీమెన్ కమిటీ సభ్యులు దొడ్డి మంగ, వెంకటరమణ, సీఈవో గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన



పందలపాకలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం గ్రామాల్లో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని యజమానులకు ఆదేశించారు. అనంతరం బిక్కవోలు పోలీసు స్టేషన్‌ను సందర్శించి, పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన కేసుల వివరాలు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాణసంచా దుకాణాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, ఇరువైపులా రెండు డ్రమ్ములతో నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ట్రైనింగ్ ఎస్సై వి.రవీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధ కృషితో లక్ష్య సాధన



ఫ్రెషర్స్‌డేలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

అనపర్తి: ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని శ్రీసాయి మాధవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తేతలి రామభద్రారెడ్డి అన్నారు. ఆ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదన్నారు. దానిని చెడు మార్గాల వైపు మళ్లించకుండా విద్య, క్రీడలు వంటి ఆసక్తి కలిగిన రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. విద్యార్థినులు చదువు మీద దృష్టి సారించి, తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్లు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సత్యభామ స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవీలత, మల్లంపూడి ప్రిన్సిపాల్ ఎన్.నవీన్, ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



జి.మామిడాడలో పర్యటిస్తున్న తహసీల్దార్, ఎస్సై తదితరులు

పెదపూడి: బాణసంచా దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు ఆదేశించారు. ఎస్సై ఎస్.తులసీరామ్, ఆర్ఐ చిట్టితల్లి తదితరులతో కలిసి ఆయన గురువారం జి.మామిడాడ, పెదపూడి, రామేశ్వరం, దోమాడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో బాణసంచా షాపులు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ షాపులను షామియానాల్లో ఏర్పాటు చేయవద్దని, పూర్తిగా రేకుల షెడ్డు వేయాలన్నారు. ప్రథమ చికిత్స, అగ్ని ప్రమాద నివారణ పరికరాలను ఉంచుకోవాలన్నారు. జి.మామిడాడలో 3, పెదపూడిలో 3, రామేశ్వరం, దోమాడ, గంగ్రేడు గ్రామాల్లో ఒక్కొక్క షాపు ఏర్పాటుకు దరఖాస్తులు అందాయన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ



ఐడీ కార్డులు, డైరీలు అందుకున్న విద్యార్థులు

సీతానగరం: రఘుదేవపురంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గుర్తింపు కార్డులు, డైరీలను పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్యామలాదేవి తెలిపారు. చైల్డ్ ట్రాకింగ్ సదుపాయంతో అధునాతన ఐడీ కార్డులు, పిల్లల హోమ్ వర్క్ తల్లిదండ్రులకు తెలియజేసేలా రూపొందించిన డైరీలను గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశామన్నారు. వీటికి పీఎంశ్రీ నిధులు, తల్లిదండ్రుల సహకారం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పిల్లి జ్యోతి, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

సీతానగరం: ఉద్యోగాలు ఇప్పిస్తానని రాజంపేటకు చెందిన పిల్లా సాయి అన్నపూర్ణ వద్ద డబ్బులు తీసుకుని, మోసం చేసిన చిట్టి పైడిరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారని ట్రైనీ ఎస్సై సురేష్ గురువారం తెలిపారు. సాయి అన్నపూర్ణ మేనల్లుడు, మేనకోడలుకు ఉద్యోగ ఇప్పిస్తానని పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన పైడి రాజు రూ.5.45 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత నుంచి అతడి ఫోన్ పనిచేయడం లేదు. దీంతో బాధితురాలు ఈ నెల 13న ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పైడిరాజును అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించిందని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని ట్రైనీ ఎస్సై తెలిపారు.

వృద్ధురాలిపై వృద్ధుడి అత్యాచారయత్నం

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామంలో ఓ వృద్ధురాలిపై వృద్ధుడు అత్యాచారయత్నం చేశాడు. ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 80 ఏళ్ల విజయ ప్రభావతి తన కుమారుడు ఏడిద అమృత కుమార్‌తో కలిసి నివసిస్తోంది. సమీపంలో ఉంటున్న 80 ఏళ్ల బావిశెట్టి మంగయ్య బుధవారం ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. ప్రభావతి ఒక్కసారిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంగయ్యను పట్టుకున్నారు. ఆ సమయంలో ప్రభావతి కుమారుడు ఇంట్లో లేడు. విషయం తెలుసుకున్న అతడు ఇంటికి వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మంగయ్యను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. అతడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.